క్లుప్తంగా

ఔషధ మొక్కల పరిరక్షణ తప్పనిసరి

అద్దంకి రూరల్: వైద్య విధానంలో ఔషధ మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని అద్దంకి ఎంఈవో 1 గంగాధరరావు అన్నారు. శనివారం ఐఈఈఆర్‌డీ సౌజన్యంతో ప్రకాశం, బాపట్ల జిల్లాలో 25 పాఠశాలల్లో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ మొక్కలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు వసతి కల్పించాలని వినతి

బల్లికురవ: పాఠశాలకు వెళ్లేందుకు బస్సు వసతి లేక తమ పిల్లలు ప్రాథమిక విద్యతోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారని గ్రామం నుంచి బస్సు వసతి కల్పించాలని కొత్తూరు వాసులు శనివారం అద్దంకి డిపో మేనేజర్‌కు అర్జీ అందజేశారు. కొత్తూరు గ్రామం నుంచి కొప్పరపాడు ఉన్నత పాఠశాలకు ఇంటర్ విద్యకోసం అద్దంకి వెళ్లే విద్యార్థులకు బస్సు వసతి లేక ఏడో తరగతితోనే విద్యార్థులు డ్రాపవుట్ అవుతున్నారని వివరించారు. గ్రామం నుంచి ఉదయం 8 గంటలకు సాయంత్రం, నాలుగు గంటలకు అద్దంకిలో బయలుదేరి తిరిగి కొత్తూరు వచ్చేలా బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో రోజుకు నాలుగు ట్రిప్పులు నడుస్తున్న అద్దంకి–మైలవరం సర్వీసు పునరుద్ధరణతో తమ గ్రామం మీదుగా వెళ్లేలా బస్సును ఏర్పాటు చేయాలని వేడుకొన్నారు. అద్దంకి డిపో మేనేజర్‌ను కలిసిన వారిలో పెంట్యాల ఆంజనేయులు, ఏ.నాగేశ్వరరావు, వాసు హనుమంతరావు తదితరులు ఉన్నారు.

ఉచిత కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ నెల 27,29,30 తేదీల్లో శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న 180 మందికి ఇచ్చినట్లు పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ కాలేషావలి తెలిపారు. శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ యేగేశ్ కుమార్, కార్నియాలజీ డాక్టర్ జాగృతి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్ చిలుకూరి వీరరాఘవయ్య, రోటరీ సభ్యులు బాచిన వెంకటరామారావు, రాయిణి రామారావు, ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వాడని తొట్లలో నీళ్లను బోర్లిస్తున్న వైద్య సిబ్బంది

బల్లికురవ: పరిసరాలను ఎప్పటికప్పుడుపరిశుభ్రంగా ఉంచుకుంటూ వాడనితొట్లు, రోళ్లను బోర్లించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్ కోరారు. అంబడిపూడి గ్రామాన్ని 20 రోజులుగా అపరిశుద్ధ్యంతో జ్వరాలు పట్టిపీడిస్తున్న క్రమంలో శనివారం ఇంటింటా సర్వేతో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వాడని తొట్లు, మురికి గుంతల వల్లే దోమల ఉత్పత్తి పెరుగుతోందని గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. కుసుమ కుమారి, సెక్రెటరీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేదరమెట్ల: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులన పాటిస్తూ వ్యవసాయం చేయడం వలన ఎంతో మేలు జరుగుతుందని మహిళా రైతులు, ఎమ్మెస్ సభ్యులు ప్రకృతి వ్యవసాయం చేయడం ఒక అంజెండాగా పెట్టుకోవాలని ఏపీఎం అనూరాధ సూచించారు. కొరిశపాడులో మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఎస్‌ఎఫ్‌ఎంటీ అశోక్‌కుమార్ బీజాంమృతం తయారీ విధానం గురించి సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గోట్‌పాక్స్ టీకాలతో రక్షణ

- పశుసంవర్ధక శాఖ ద్వారా గోవులకు ఉచితంగా టీకాలు
- ముద్దచర్మ వ్యాధి నివారణకు గోట్ పాక్స్ టీకాలు
- టీకాలు వేయించు కోవాలని పశువైద్యాధికారుల సూచన



గోట్ పాక్స్ వైరస్ సోకిన ఆవు

వేటపాలెం: రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జీవాల పెంపకం అనాదిగా వస్తున్న ఆచారం. వీటిలో పశుపోషణ కూడా ముఖ్యమైనది. వాటిని కన్నబిడ్డల్లా చూసుకోవాలని పశువైద్యాధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గోవులకు గోట్ పాక్స్ వ్యాధి నిరోధక టీకాల ద్వారా రక్షణ కల్పిస్తుంది. పశువులకు వచ్చే ముద్దచర్మ వ్యాధి (లంపీ) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈవ్యాధి సోకిన ఆవులు, ఎద్దులకు చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడతాయి. ఈ వ్యాధి వల్ల ఆవులు, ఎద్దులు చాలా ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణకు ఈనెల 25 నుంచి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోట్ పాక్స్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పశుపోషకులు ఈ టీకాలను సద్వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి పుష్పలత తెలిపారు.

వ్యాధి లక్షణాలు..

- ఆవులు, ఎద్దులు శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- అధిక జ్వరం వస్తుంది.
- బలహీనంగా అలసటగా కనిపిస్తాయి.
- ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువ ఆహారం తీసుకుంటాయి.
- లంపీస్కిన్ వ్యాధి సోకిన ఆవులు తక్కువ పాలు ఇస్తాయి.

వ్యాధి వ్యాప్తి..

లంపీస్కిన్ వ్యాధి వైరస్ పశువుల నుంచి పశువులకు దోమలు, ఇతర కీటకాల ద్వారా వ్యాపిస్తుంది. వ్యాక్సిన్‌తోనే ఈ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది.

ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి

దేశంలో ప్రభుత్వం ఉచితంగా గోట్ పాక్స్ వైరస్‌వ్యాక్సిన్ అందిస్తోంది. ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సొసైటీల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తోంది. అలాగే పశుపోషకలు ఈ వ్యాధి నివారణ చికిత్స పై అవగాహన కల్పిస్తోంది. ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పశువులు ఉండే ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.
- వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించాలి.
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి.

లంపీస్కిన్ వ్యాధి టీకాలు వేయించుకోవాలి..

లంపీస్కిన్ వ్యాధి పశులకు ప్రమాదకరం. జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. పాడి రైతులు పశువైద్యాధికారుల సలహాలు పాటించి పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ముద్ద చర్మవ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నాం. అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి.

– పుష్పలత, పశువైద్యాధికారి, వేటపాలెం

వేసిన బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తేళ్ల నాగమ్మ



సమావేశానికి హాజరైన సభ్యులు

జే.పంగులూరు: అవసరమైన చోట బోర్లు వేయకుండా అనవసరమైన చోట్ల బోర్లు వేశారని ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో పలు సమస్యలు చర్చకు వచ్చాయి. వాటిలో ప్రధానంగా అలవలపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ షేక్ హుసేన్ పలు సమస్యలను ప్రస్తావనకు తీసుకొచ్చారు. గ్రామంలో శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. దోమలు విపరీతంగా కుడుతున్నాయని, పంచాయతీ వారికి ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామంలో సంవత్సరాల కొద్ది బోర్లు చెడిపోతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈమధ్య కాలంలో వేసిన బోర్లు గ్రామస్తులకు నిరుపయోగంగా మారాయన్నారు. కాలనీలకు మధ్యలో వేస్తే ఉపయోగం ఉండేదన్నారు. ఈ సందర్భంగా తీర్మానాల విషయం అడగగా, తీర్మానాలు ఏమి లేకుండానే చర్చలు, సమావేశాలతోనే సమావేశం ముగిసిందని ఎంపీడీఓ మాథ్యూబాబు తెలిపారు. సమావేశం ప్రాంభానికి ముందు అధికారులు అతి తక్కువ మందే అందుబాటులో ఉన్నారు. వచ్చిన అధికారులు వారి శాఖకు సంబంధించిన విషయాలు తెలియజేసి, సమావేశ పుస్తకంపై సంతకం చేసి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, వైఎస్ ఎంపీపీ యర్రం శ్రీనివాసరెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ: ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి మూడున్నర దశాబ్దాలుగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు వైఎస్సార్ మాస్టారు బంగారు బాటలు వేశారని ఎంఈవో–2 కే రమేష్‌బాబు కొనియాడారు. బల్లికురవ ఉన్నత పాఠశాలల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యద్దనపూడి శ్రీనివాసరావు ఈనెల 31 తేదీ ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు పాఠశాల హెచ్‌ఎం కే. హనుమంతరావు అధ్యక్షత వహించారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు మాట్లాడుతూ యద్దనపూడిని నేటితరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలనతో పాటు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించడం వల్ల ఆయన శిష్యులు నేడు అనేక రంగాల్లో స్థిర పడ్డారన్నారు. శ్రీనివాసరావు దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజుల్లి, పూనూరు, కొనిదెన, ఉప్పుమాగులూరు, పెదఅంబడిపూడి, కేవీ పాలెం, వైదన, కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నేతలు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌తో ఉపాధ్యాయుల్లో బోధన మెరుగు



మేదరమెట్లలో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ డీఈవో నిర్మల



పర్చూరులో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీరాల అర్బన్: పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంతో ఉపాధ్యాయుల్లో బోధన, నిబద్ధత పెరుగుతుందని చీరాల డిప్యూటీ విద్యాశాఖాధికారిణి ఎం.నిర్మల అన్నారు. ఈనెల 22 నుంచి జరుగుతున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించగా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో మొక్కలు నాటి ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని చదువులో చక్కగా రాణించాలన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పరిశీలించాలని సూచించారు. ఈఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్‌లో పదోతరగతి పరీక్షలు రాస్తున్నందున విద్యా సంవత్సరం మొదటి నుంచే సరైన దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సాల్మన్, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త భానుచంద్రమూర్తి, ఉపాధ్యాయులు గాంధీ, రాజేంద్రప్రసాద్, సుందరరామిరెడ్డి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రంలో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు పున్నయ్య, రాఘవరావు, హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ..

చినగంజాం (పర్చూరు): శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంఈవో వెంకటరామయ్య మొక్కలు నాటారు. ఈసందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వరాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



అద్దంకిలో మాట్లడుతున్న ఎంఈవో గంగాధర్‌రావు



వేటపాలెంలో మొక్క ఆకారంలో విద్యార్థుల మానవహారం

అద్దంకి: పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యమని ఎంఈవో గంగాధర్‌రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం–2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు (మిషన్ లైఫ్ ఆక్టివిటీస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా పాఠశాలల్లో పోషణ దినోత్సవ నిర్వహణ, (న్యూట్రిషన్ డే) కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి, అమ్మపేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మొక్కలపై ప్రజలకు, విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో ఏ చెట్టు కింద నిలబడాలన్నా అద్దె కట్టి మరీ నిల్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. మొక్కల ఆవశ్యకతను ప్రతి విద్యార్థి అర్థం చేసుకునే విధంగా చూడాలని సూచించారు. అనంతరం తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, వేప, తులసి, అలోవెర, అశ్వగంధ, బ్రహ్మి, ఉసిరి, తమలపాకు, ఎర్రచందనం, రణపాల, నల్ల పసుపు, పుదీనా, సన్న ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐఈఈఆర్డీ సేవా సంస్థ అధ్యక్షులు బి.కిరణ్ చంద్, హెచ్‌ఎంలు పి. గంగాధర్‌రావు, శ్రీనివాస్‌మూర్తి, పురుషోత్తమ్మ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సీఆర్పీలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం..

వేటపాలెం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని హెచ్‌ఎం సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులు మొక్కల ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఐటీసీ సంస్థ ప్రతినిధి రాజా కొండలు, అనిత, భూషణం, జానమ్మ పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ప్రతి విద్యార్థి మొక్కను దత్తత తీసుకోవాలని సమగ్రశిక్ష బాపట్ల జిల్లా ఫైనాన్స్ ఎకౌంట్స్ ఆఫీసర్ షేక్ సైదావలి అన్నారు. శిక్షాసప్తాహ్ కార్యాక్రమంలో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కాకానిపాలెం బాలికల గురుకుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎంఈవో బీ. సుధాకర్, హెచ్‌ఎం గురవయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దుర్గా గాయత్రి, సీఆర్పీలు పాల్గొన్నారు. స్థానిక నాగార్జున పాఠశాలలో ఎంఈవో బీ. సుధాకర్ విద్యార్థులకు మొక్కలు పంపిణీచేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ టి. రామకృష్ణ మొక్కలు నాటించారు.



కాకానిపాలెంలో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న విద్యాశాఖాధికారులు

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



అద్దంకిలో అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

చినగంజాం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని పలువురు నాయకులు పేర్కొన్నారు. కలాం వర్ధంతిని శనివారం చినగంజాం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీకి చెందిన ముస్లింలు కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈసు షాకీర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల అబ్దుల్ కలాం విగ్రహానికి హెచ్‌ఎం ఎం నిర్మల, స్థానిక కొమ్మి ఫౌండేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు సయ్యద్ కరిముల్లా, ఉపాధ్యక్షుడు కొండపల్లి వెంకయ్య, గడ్డం మస్తాన్‌వలి కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య ఆధ్వర్యంలో కలాం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మాలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ,రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు చిన్ని మురళీ కృష్ణ, యూ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, పసుపులేటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వలపర్లలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బ్యాంకు ముందు నిలిపిన బైకు అపహరణ

అద్దంకి రూరల్: బ్యాంకు ముందు నిలిపిన బైకు శుక్రవారం అపహరణకు గురైంది. హెడ్ కానిస్టేబుల్ సైదయ్య వివరాల మేరకు.. మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన ముట్లూరి అంజయ్య శుక్రవారం బైకుమీద పని కోసం ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు వచ్చి బ్యాంకు ఎదుట బైకు ఆపి లోపలికి వెళ్లి పనిముగించుకుని బయటకు వచ్చి చూసేసరికి తన ఏపీ 40 సీవై 4338 నంబర్‌గల బైకు కనబడలేదు. చుట్టు పక్కల వెతికినా కనబడకపోవటంతో బైకు ఎవరో దొంగిలించారని నిర్ధారించుకుని శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

ఫార్మాసిస్ట్‌పై డాక్టర్ ఫిర్యాదు

వేటపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్న జీఎస్ వెంకట ప్రసాదరావు తనను దుర్భాషలాడి దాడిచేశాడని స్థానిక పోలీసు స్టేషన్‌లో డాక్టర్ కాట బాలరాజు శనివారం ఫిర్యాదు చేశారు. ఫార్మాసిస్టు తన గదిలోకి వచ్చి మాట్లాడటానికి ప్రయత్నించగా నేను ఓపీలో బిజీగా ఉన్నానని చెప్పగా వినిపించుకోకుండా దురుసుగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైద్యశాలలో మందుల విషయంపై తనతో ఘర్షణ పడి దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలానే అనేక పర్యాయాలు ఫార్మసిస్టు తనపై ఘర్షణలకు దిగాడన్నారు. నేనే నావిధుల్లో చాలా ఇబ్బందులకు గురవుతున్నానని, నాకు రక్షణ కల్పించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వం తగదు

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందించడంతో పాటుగా ప్రజలకు జవాబుదారీతనంగా పని చేయాలని ఇన్‌చార్జి తహశీల్దార్ పి.సురేష్‌బాబు సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా పత్రాలు మంజూరు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల వారీగా ఓటీఎస్ వివరాలు, పెండింగ్ అర్జీలపై విచారించారు. సమావేశంలో ఆర్ఐలు అర్జున్, శేఖర్, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు



హెల్మెట్ వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మేదరమెట్ల: ద్విచక్ర వాహనాలను నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని మేదరమెట్ల ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై కలిగే ప్రయోజనాల గురించి తెలిపే అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడపడం వల్లనే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు చర్యల్లో భాగంగానే హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని ఎస్సై అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.